

జగన్‌నే సీఎం చేసుకుందాం

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందామని మంత్రి సురేష్ పిలుపునిచ్చారు. యర్రగొండపాలెంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు.

- 8లో..

వైఎస్సార్ సీపీ డాక్టర్ల విభాగం రాష్ట్ర అధ్యక్షునిగా బత్తుల



జిల్లాకు చెందిన డాక్టర్ బత్తుల అశోక్ కుమార్‌రెడ్డి వైఎస్సార్ సీపీ డాక్టర్ల విభాగం రాష్ట్ర అధ్యక్షునిగా నియమితులయ్యారు. ఆయనతో పాటు జిల్లాకు చెందిన పలువురు డాక్టర్లు రాష్ట్ర కమిటీలో స్థానం దక్కించుకోగా, జిల్లా కమిటీ అధ్యక్షునిగా చంద్రగిరి నంద కిషోర్, ఒంగోలు నగర కమిటీ అధ్యక్షునిగా జె.మణి బాబును నియమించారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
37/26

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఈవీఎం గోదామును పరిశీలించిన కలెక్టర్



గోదాము వద్ద అధికారులతో కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: స్థానిక మామిడిపాలెంలోని ఈవీఎం గోదామును కలెక్టర్ దినేష్‌కుమార్ శనివారం పరిశీలించి తనిఖీ చేశారు. రాబోయే సాధారణ ఎన్నికల్లో వినియోగించేందుకు ఇప్పటికే జిల్లాకు చేరిన బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్‌ల తొలి దశ పరిశీలన ప్రక్రియ అక్టోబర్ 16 నుంచి 23 రోజుల పాటు జరుగుతుందన్నారు. అందుకోసం బెంగళూరు ఎల్ కంపెనీ నుంచి 15 మంది నిపుణులు వస్తారని తెలిపారు. ఆ మేరకు అధికారులు తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. ఎటువంటి లోపాలు లేకుండా ప్రక్రియ పూర్తి కావాలని, బారికేట్‌లు, అవసరమైన భద్రత చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి శ్రీలత, ఎన్నికల విభాగం అధికారి శ్రీనివాసరావు, తహసీల్దార్ మురళి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మూడో దశ రీ సర్వే పూర్తి చేయాలి

- జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు



రీ సర్వేపై సమావేశం నిర్వహిస్తున్న జేసీ

ఒంగోలు అర్బన్: జిల్లాలో చేపట్టిన మూడో దశ రీ సర్వేని నిర్దేశించిన సమయంలో పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు సంబంధిత అధికారులకు సూచించారు. శనివారం స్థానిక ప్రకాశం భవనంలో రీ సర్వేపై సర్వే అండ్ ల్యాండ్స్ శాఖ అధికారులు, సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ మూడో దశ గ్రామాలకు సంబంధించి మ్యుటేషన్ గ్రౌండ్ ట్రూథింగ్ దశలోనే గుర్తించి వచ్చే నెల 15వ తేదీ నాటికి పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో సర్వే అండ్ ల్యాండ్స్ ఏడీ కిషోర్‌బాబు, ఇన్‌స్పెక్టర్లు, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

14 రోజులకే చంద్రబాబు విలవిల

- 16 నెలలు జైలులో ఉండి కూడా చిరునవ్వుతో బయటకు వచ్చిన జగన్
- బీజేపీ రాష్ట్ర ప్రత్యేక ఆహ్వానితుడు, మాజీ ఎమ్మెల్యే దారా సాంబయ్య



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దారా సాంబయ్య

చీమకుర్తి: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 14 రోజులు జైలులో ఉన్నందుకే విలవిల్లాడిపోతున్నాడని, అదే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 16 నెలలు జైలులో ఉన్నప్పటికీ చిరునవ్వులతో బయటకు వచ్చాడని బీజేపీ రాష్ట్ర ప్రత్యేక ఆహ్వానితుడు, మాజీ ఎమ్మెల్యే దారా సాంబయ్య అన్నారు. శనివారం చీమకుర్తిలో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 16 నెలలు జైలులో ఉన్న జగన్‌కు ఆత్మవిశ్వాసం తగ్గలేదని, చిన్న వయసులోనే ప్రజల్లోకి వెళ్లి అందరి మన్ననలు అందుకున్నారని, అందుకే సీఎం అయ్యారని ప్రశంసించారు. ఎస్సీ వర్గీకరణ హేతుబద్ధంగా చేయకపోవడం వలనే చంద్రబాబు 2004లో ఓడిపోయాడని, సరిపడా ఎమ్మెల్యేల సంఖ్య ఉన్నా వైఎస్సార్ సీపీకి చెందిన 23 మంది ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి విలువలను తుంగలో తొక్కడం వలనే 2019లో మరోసారి ఓటమి పాలయ్యాడని దారా సాంబయ్య అన్నారు. 14 రోజుల జైలుకే ఆత్మవిశ్వాసం కోల్పోయి విలపిస్తుంటే టీడీపీ కార్యకర్తల్లో ఏం విశ్వాసాన్ని నింపగలరని చంద్రబాబును ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు పాద వరప్రసాదరావు, రాష్ట్ర కౌన్సిలర్ సంకె సుబ్బారావు, చీమకుర్తి పట్టణ అధ్యక్షుడు బొద్దు శంకర్, రూరల్ అధ్యక్షుడు బొడ్డపాటి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి దివి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నల్లమలలో షికారు చేద్దాం

మనసును పులకింపజేసే ప్రకృతి అందాలు.. గాండ్రించే పులులు.. వివిధ రకాల వణ్యప్రాణులు.. అరుదైన వృక్షజాతులకు నెలవైన నల్లమల అభయారణ్యం రా రమ్మని పిలుస్తోంది. పర్యావరణ ప్రేమికులను ఆకట్టుకునే విధంగా అత్యాధునిక వసతులు, రోబోటిక్ మ్యూజియం, విద్యుత్ దీపాలంకరణలు హైలెట్‌గా మారనున్నాయి. స్వేచ్ఛగా సంచరించే పులులు, ఎలుగుబంటి, జింకలు, దుప్పులు, హైనా, నెమళ్లతో పాటు 70 రకాల క్షీరదాలు, సరీసృపాలు జీపుల్లో ప్రయాణించే పర్యాటకులకు సరికొత్త అనుభూతులు పంచనున్నాయి. పులుల ప్రత్యుత్పత్తి సమయంలో వాటి ఏకాంతం కోసం మూడు నెలలు మూతపడిన జంగిల్ సఫారీ ఆదివారం నుంచి తెరుచుకోనుంది. ఇంకెందుకాలస్యం.. నల్లమలను చుట్టొచ్చేద్దాం పదండి...

- నేటి నుంచి తెరుచుకోనున్న పర్యాటక ప్రాంతాలు
- మనసు దోచనున్న జంగిల్ సఫారీ
- 14 కిలోమీటర్లు అద్భుత ప్రయాణం
- రోబోటిక్ టెక్నాలజీతో ఆకట్టుకోనున్న మ్యూజియం
- ఇష్టకామేశ్వరి ఆలయంలో దర్శనాలు ప్రారంభం
- సందర్శకుల విశ్రాంతికి పగోడాలు

ఒంగోలు డెస్క్

సండే స్పెషల్



శ్రీశైలం ఘాట్ రోడ్లో ఏర్పాటు చేసిన జంగిల్ సఫారీ ముఖద్వారం, మ్యూజియంలో వన్యప్రాణుల ఆకృతులు

నాగార్జున సాగర్– శ్రీశైలం పులుల అభయారణ్యం (ఎన్ఎస్‌టీఆర్) 3,568 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉంది. అభయారణ్యం పరిధిలో 70 బేస్ క్యాంపుల్లో 800 మంది కాపలా కాస్తున్నారు. సీసీ కెమెరాలతో నిరంతరం నిఘా ఉంది. నల్లమల అభయారణ్యంలో పులుల సంతతి పెరిగేందుకు అటవీశాఖ ప్రత్యేక దృష్టి సారించింది. అందులో భాగంగా పులులకు ఆహారంగా ఉండే జింకలు, దుప్పులు, అడవి పందుల పెరుగుదలకు అనుకూల ఆవాసం కల్పించడంతో పాటు స్వేచ్ఛాయుత వాతావరణంలో అవి సంచరించేందుకు అవసరమైన చర్యలు చేపట్టింది. జూలై ఒకటో తేదీ నుంచి సెప్టెంబర్ 30వ తేదీ వరకు పులుల కలయికకు అనుకూలమైన వాతావరణం. దీంతో దట్టమైన అభయారణ్యంలోని నిషిద్ధ ప్రాంతాల్లోకి పర్యాటకులు, ప్రజలు వెళ్లకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంది. ఎకోటూరిజాలు, జంగిల్ సఫారీలతో పర్యాటకులు సంచరించకుండా నిషేధం విధించింది. మూడు నెలల విరామం అనంతరం జంగిల్ సఫారీ, ఇష్టకామేశ్వరిదేవి యాత్రలు ఆదివారం నుంచి తిరిగి ప్రారంభం కానున్నాయి. అటవీ ఆంక్షలు ముగియడంతో పర్యాటకులు నల్లమల అందాల వీక్షణతో పాటు అటవీ ప్రాంతంలోని ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రాల సందర్శనకు అవకాశం కలిగింది.

జంగిల్ సఫారీకి సరికొత్త హంగులు...

శ్రీశైలం ఘాట్‌రోడ్డులోని తుమ్మలబైలు సమీపంలో ఏర్పాటు చేసిన జంగిల్ సఫారీకి సరికొత్త హంగులు దిద్దారు. ఇవి పర్యాటకులకు మరపురాని అనుభూతి కల్పించనున్నాయి. సఫారీలో తొలుత అత్యాధునిక రోబోటిక్ టెక్నాలజీతో రూపొందించిన మ్యూజియం అందర్నీ ఆకట్టుకోనుంది. పెద్దపులులు, చిరుత పులులు, జింకలు, నీల్‌గాయ్‌లు, తోడేళ్లు, రైలు ఎలుగులు, వేటకుక్కలు, పాములు ఇలా ఎన్నో వన్యప్రాణుల ఆకృతులు ఏర్పాటు చేశారు. ఏ వన్యప్రాణి ప్రతిమ ముందు నిలబడితే ఆ వన్యప్రాణికి సంబంధించిన పూర్తి వివరాలు, విశేషాలు మనకు రోబోటిక్ టెక్నాలజీ ద్వారా స్పీకర్‌లో వినేలా తీర్చిదిద్దారు. అలాగే సీతాకోక చిలుకలు, తాబేళ్ల ఆకారాల్లో కూర్చునేందుకు ప్రత్యేక సీట్లు, చిన్నారులను ఆకట్టుకునే కొత్త కొత్త ఆకృతులు, సందర్శకుల కోసం అధునాతన టాయిలెట్లు ఇలా ఎన్నో నూతన సొగసులు పర్యాటకులకు సౌకర్యాన్ని అందించనున్నాయి. పులి చెరువు, నరమామిడి చెరువు ప్రాంతాల్లో స్వేచ్ఛగా సంచరించే పెద్దపులితో పాటు చిరుతలు, కృష్ణ జింకలు, దుప్పులు, నెమళ్లు జిప్సీలలో ప్రయాణించే పర్యాటకులకు అనిర్వచనీయమైన అనుభూతినిస్తాయనడంలో ఎటువంటి సందేహం లేదు. దీంతో పాటు భక్తుల కోర్కెలు తీర్చే కొంగుబంగారమైన ఇష్టకామేశ్వరి యాత్రను సైతం అధికారులు ఆదివారం ప్రారంభించనున్నారు.



రోబోటిక్ టెక్నాలజీతో సిద్ధమవుతున్న వన్యప్రాణుల మ్యూజియం



నల్లమలలో సంచరిస్తున్న పెద్దపులి



ఇష్టకామేశ్వరి అమ్మవారి ఆలయం

అధునాతన హంగులు



జంగిల్ సఫారీని అధునాతన హంగులతో అద్భుతంగా తీర్చిదిద్దాం. రోబోటిక్ టెక్నాలజీతో కూడిన వన్యప్రాణుల ఆకృతులు అందరినీ ఆకట్టుకుంటాయి. అన్ని రకాల జంతువుల ఆకృతులు, వాటి నుంచి వెలువడే శబ్దాలు సందర్శకులను కనువిందు చేస్తాయి. దీంతో పాటు సందర్శకులకు విశ్రాంతికి పగోడాలు, టాయిలెట్లు సిద్ధం చేశాం. చిన్నారులను ఆకట్టుకునేలా ఎన్నో ఏర్పాట్లు చేశాం.

– ఆరిఫ్‌ఖాన్, డిప్యూటీ రేంజ్ అధికారి, అటవీశాఖ, పెద్దదోర్నాల

జిప్సీలలో ప్రయాణం...

గొర్లెస్ కాలువ నుంచి రెండు విలాసవంతమైన వాహనాల్లో 14 కిలోమీటర్ల ప్రయాణం సుమారు రెండు గంటలు సాగనుంది. లోతట్టు అటవీ ప్రాంతంలోని నరమామిడి చెరువు, వ్యూపాయింట్, పులిచెరువు తదితర ప్రాంతాల మీదుగా తిరిగి ముఖద్వారం వద్దకు చేరుకోవడంతో యాత్ర ముగుస్తుంది. నల్లమల టైగర్ రిజర్వ్ ఫారెస్టులోని శీతోష్ణస్థితి ప్రాంతమైన పులిచెరువు ప్రాంతం వన్యప్రాణులకు మంచి ఆవాసం. సహజ సిద్ధంగా నీటి వనరులతో ఉండే ఈ ప్రాంతంలో పెద్దపులులు, చిరుతలు, ఎలుగుబంట్లతో పాటు జింకలు, దుప్పులు, నెమళ్లు, కొండ గొర్రెలు, రేచు కుక్కలు, కుందేళ్లు, అడవి పందులు, ముళ్ల పందులు.. ఇలా ఎన్నో వన్యప్రాణులు సంచరిస్తూ ఉంటాయి. సాధారణంగా ఈ ప్రాంతానికి వెళ్లే అవకాశం అటవీశాఖ అధికారులకు మాత్రమే ఉండేది. టైగర్ సఫారీ ఏర్పాటుతో సామాన్యులకు సైతం ఈ ప్రాంతంలో పర్యటించే అద్భుత అవకాశం కలిగింది. జంగిల్ సఫారీలో ప్రయాణించే ఒక్కో సఫారీ వాహనంలో అటవీశాఖ ఆరుగురు సందర్శకులకు అనుమతిచ్చింది. ఒక్కో జిప్సీకి రూ.2,400 చార్జీ వసూలు చేస్తారు.

ప్రజల ఆరోగ్య సంరక్షణే ప్రభుత్వ ధ్యేయం

- మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్
- త్రిపురాంతకం మండలం మేడపిలో ఘనంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రారంభం



జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్

త్రిపురాంతకం: ప్రజల ఆరోగ్య సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించడం గొప్ప విషయమని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రారంభం సందర్భంగా త్రిపురాంతకం మండలం మేడపి గ్రామంలో శనివారం నిర్వహించిన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టారనేందుకు ఇదే నిదర్శనమని అన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ప్రవేశపెట్టి సేవలందించిన విషయాన్ని గుర్తు చేశారు. అదే బాటలో ముఖ్యమంత్రి జగన్ ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేసి ప్రజల అవసరాలన్నీ తీరుస్తున్నారన్నారు. ప్రజలు సుభిక్షంగా ఉంటేనే రాష్ట్రం పురోభివృద్ధి సాధిస్తుందని, దానికనుగుణంగా మంచి పాలనను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్నారని వివరించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు, వలంటీర్లు ఇంటి వద్దకు వచ్చి ప్రజల ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకుంటున్నారని వివరించారు. ఇప్పటికే మూడు దశల్లో కార్యకర్తలు ఇంటికొచ్చి పేర్లు నమోదు చేసుకున్నారన్నారు. ప్రతి ఒక్కరికీ ఏడు రకాల వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారందరికీ మెరుగైన వైద్యసేవలు అందించి మందులు అందించడం జరుగుతుందన్నారు. ప్రతిఒక్కరూ ఆరోగ్యాన్ని అశ్రద్ధ చేయకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని మంత్రి సూచించారు. ప్రభుత్వం పేదవర్గాలందరికీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. వైద్యులంతా అందుబాటులో ఉండి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. యర్రగొండపాలెంలో వంద పడకల ఆస్పత్రి వైద్యసేవలందిస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. అదే విధంగా మార్కాపురంలో రూ.500 కోట్లతో మెడికల్ కళాశాల నిర్మాణంలో ఉందన్నారు. ఈ విధంగా గ్రామీణ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందన్నారు. కలలో కూడా ఊహించని విధంగా వైద్యరంగంలో మార్పు తేవడం జరిగిందని సురేష్ వివరించారు. ప్రజలంతా ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్స్‌ను మంత్రి సురేష్ పరిశీలించారు. వైద్య శిబిరాన్ని ప్రారంభించి వృద్ధులకు కళ్లద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి, జెడ్పీటీసీ మాకం జాన్‌పాల్, గ్రామసర్పంచ్‌లు గుమ్మ యల్లమ్మ, పొన్న వెంకటలక్ష్మి, ఓబులురెడ్డి, వెంకట తిరుమలయ్య, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా కార్యదర్శి ఆర్‌వీ పిచ్చయ్య, పార్టీ కన్వీనర్ ఎస్.పోలిరెడ్డి, కో కన్వీనర్ యల్లారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు దగ్గుల గోపాల్‌రెడ్డి, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓలు శ్రీనివాసరావు, పద్మావతి, వైద్యాధికారి నాగేశ్వరరావు నాయక్, కరుణకుమార్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఖాళీ కుర్చీలే చంద్రబాబుకు తోడు..!



యర్రగొండపాలెం శిబిరంలో ఖాళీగా ఉన్న కుర్చీలు

యర్రగొండపాలెం: బాబుగారికి తోడుగా కార్యక్రమం జిల్లాలో పెద్ద ఎత్తున జరుగుతోందని పచ్చమీడియా చేస్తున్న ప్రచారమంతా బోగస్ అని తేలింది. యర్రగొండపాలెం శిబిరంలో శనివారం దర్శనమిచ్చిన ఖాళీ కుర్చీలే అందుకు నిదర్శనంగా నిలిచాయి. స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంతో ప్రజాధనాన్ని దోచుకుని రిమాండ్‌లో ఉన్న చంద్రబాబు కోసం టీడీపీ తలపెట్టిన బాబుగారికి తోడుగా కార్యక్రమంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు టీడీపీ నాయకులు రిలే నిరాహార దీక్షలు చేయాల్సి ఉంది. కానీ, స్థానిక యూనియన్ బ్యాంకు ఎదురుగా ఏర్పాటు చేసిన రిలే నిరాహార దీక్ష శిబిరంలో ఉదయం 11 గంటల తర్వాత ఎవరూ లేకపోవడం పచ్చమీడియా బూటకపు ప్రచారాన్ని బట్టబయలు చేసింది.

శవమై తేలిన చిన్నారి



రమ్య మృతదేహం



మృతికి కారణమైన బావి

- పాఠశాల నుంచి ఇంటికెళ్లే దారిలో పాడుబడిన బావిలో రమ్య మృతదేహం లభ్యం

చీమకుర్తి: అనుమానమే నిజమైంది. పాఠశాల నుంచి ఇంటికెళ్లే దారిలో ఉన్న పాడుబడిన బావిలో చిన్నారి రమ్య శవమై తేలింది. సంతనూతలపాడు మండలం మద్దులూరులో శుక్రవారం పాఠశాల నుంచి ఇంటికి బయలుదేరిన ఐదేళ్ల బాలిక మనుబ్రోలు రమ్య అదృశ్యం కావడం కలకలం సృష్టించింది. పాప కోసం శుక్ర, శనివారాలు ఒంగోలు ఏఎస్పీ, డీఎస్పీ, ఇద్దరు సీఐలు, 8 మంది ఎస్సైలు, సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు. అదే రోడ్డుపై పదుల సంఖ్యలో పోలీసులు గాలిస్తూనే ఉన్నారు. కానీ, రోడ్డు పక్కనున్న బావిలో పడి ఉంటుందనే అనుమానం ఉన్నప్పటికీ నీటిలో పూర్తిగా గాలించలేదు. చివరకు శనివారం సాయంత్రం అదే బావిలో శవమై తేలింది. పాఠశాల నుంచి రమ్య ఇంటికెళ్లే దారిలో పాడుబడిన బావి ఉంది. ఆ బావి చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగి బావిని అల్లుకుని ఉన్నాయి. బావి చుట్టూ రెండున్నర అడుగుల ఎత్తున గోడ కట్టి ఉంది. ఆ గోడ ఎక్కి మరీ బావిలో ఎందుకు పడుతుందిలే అనుకున్నారు అందరూ. ఒకవేళ బావి గోడ ఎక్కి పొరపాటున జారిపడి ఉంటుందేమోనన్న అనుమానం పోలీసులు, స్థానికులకు రాలేదు. కొందమందికి అనుమానం వచ్చినా అప్పటికే శుక్రవారం రాత్రి కావడంతో చీకట్లో బావిలోకి టార్చ్‌లైట్ వేసి మొక్కుబడిగా చూశారు. శనివారం పగటి పూట కూడా బావిలో వెతకలేదు. శుక్రవారం మద్దులూరు గ్రామంలోకి చిత్తుకాగితాలు కేరుకునే కొంతమంది రావడంతో అదృశ్యమైన బాలికను వారు ఏమైనా తీసుకెళ్లి ఉంటారేమో అనే అనుమానం దిశగా పోలీసుల విచారణ సాగింది. శనివారం సాయంత్రం 4 గంటల సమయంలో బావిలో మళ్లీ ఒకసారి పోలీసులు చూడగా, పాపతో పాటు స్కూల్ బ్యాగు నీటిపై తేలియాడుతూ కనిపించడంతో వెంటనే బయటకు తీశారు. రమ్యతో పాటు బడికి వెళ్లే ఆమె అక్కను పోలీసులు విచారించారు. ప్రతి రోజు బడికి వెళ్లేటప్పుడు, వచ్చేటప్పుడు పిల్లలంతా కలిసి బావి దగ్గరకు వెళ్లి బావిలోకి రాళ్లు విసురుతారని ఆమె చెప్పింది. రమ్య కూడా రాళ్లు వేసేందుకు బావి వద్దకు వెళ్తుండేదని చెప్పింది. అయితే, బావి ఒడ్డు ఎక్కి పొరపాటున జారి పడి ఉంటుందా.? లేకుంటే ఎవరైనా కావాలనే బావిలో పడేసి ఉంటారా..? అనే అనుమానాలు ఉన్నాయి. ఆ దిశగా పోలీసులు విచారిస్తున్నారు. బావిలో నుంచి బయటకు తీసిన రమ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు తరలించారు. తల్లి కోటేశ్వరి ఫిర్యాదు మేరకు సంతనూతలపాడు ఎస్సై అంజనేయులు కేసు నమోదు చేశారు. రమ్య మృతితో గ్రామంలో ఒక్కసారిగా విషాదం అలముకుంది.

క్లుప్తంగా

కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపిన వీఆర్‌ఓ సంఘం



కలెక్టర్‌తో వీఆర్‌ఓ సంఘం నూతన కమిటీ సభ్యులు

ఒంగోలు అర్బన్: వీఆర్‌ఓ సంఘం ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వైపీ రంగయ్య, ఆదిరెడ్డిల ఆధ్వర్యంలో సంఘ సభ్యులు శనివారం ప్రకాశం భవనంలో కలెక్టర్ దినేష్ కుమార్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా కమిటీ నూతనంగా ఎన్నికైన సందర్భంతో పాటు ఇటీవల వీఆర్‌ఓలకు సీనియర్ అసిస్టెంట్‌లుగా పదోన్నతి కల్పించడం, గ్రేడ్–2 వీఆర్‌ఓలకు రెగ్యులర్ పేస్కేల్ మంజూరు చేసిన నేపథ్యంలో సంఘ సభ్యులు కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు. దీనిలో సీనియర్ అసిస్టెంట్ పి. రాము, వీఆర్‌ఓ సంఘం సభ్యులు కె. జానయ్య, కె. రవికుమార్, పి. బెంజిమెన్, చంద్రశేఖర్, సుబ్బరామిరెడ్డి, రమేష్, శ్రీకాంత్, వెంకటరామయ్య, జగదీష్, వినీల, అరుణ, కీర్తి, శివ, పాపారావు పాల్గొన్నారు.

సోమవారం స్పందన రద్దు

ఒంగోలు టౌన్: జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్లు ఎస్పీ మలికా గర్గ్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అక్టోబర్ 2వ తేదీన గాంధీ జయంతిని పురస్కరించుకొని ఈ కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు పేర్కొన్నారు. జిల్లా ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని, దూర ప్రాంతాల నుంచి ఎవరూ రావద్దని ఎస్పీ కోరారు.

జగన్‌నే సీఎంగా చేసుకుందాం

- రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్



మాట్లాడుతున్న మంత్రి సురేష్

యర్రగొండపాలెం: పార్టీలకు అతీతంగా అన్ని వర్గాలకు నవరత్నాల పథకాలను అమలు పరుస్తూ దేశంలోనే రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా చేసుకోవాల్సిన అవసరం ఉందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. శనివారం స్థానిక తన క్యాంపు కార్యాలయంలో మాట్లాడారు. వైఎస్సార్ డాక్టర్ కావడం వలన ప్రజల పేదల ఆరోగ్యాన్ని పరిరక్షించటానికి ఆరోగ్యశ్రీ కార్యక్రమాన్ని అమలు పరచి ఆదర్శంగా నిలిచారన్నారు. ఆయన తనయుడు జగన్‌మోహన్‌రెడ్డి రెండు అడుగులు ముందుకువేసి ఆ పథకాలతోపాటు మరికొన్ని ఆరోగ్య పథకాలను అమలు పరుస్తున్నారని చెప్పారు. దీనివలన కార్పొరేట్ వైద్యశాలల మెట్లుకూడా తొక్కలేని పేదలకు భరోసా దొరికిందని చెప్పారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా జగనన్న ఆరోగ్య సురక్ష పథకం అమలుకు శ్రీకారం చుట్టారని, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మస్తిష్కంలో నుంచి పుట్టుకొచ్చిన ఈ పథకం వరం లాంటిదన్నారు. వైద్య సిబ్బంది ప్రతి పౌరుడి ఇంటివద్దనే పేరుమోసిన డాక్టర్లతో ఉచితంగా ఆరోగ్య పరీక్షలు, ఉచితంగా మందులు అందిస్తారని వివరించారు. గత నాలుగున్నరేళ్లగా తమ ప్రభుత్వం చేపట్టిన అనేక కార్యక్రమాలు ప్రజల ఇంటివద్దే సంపూర్ణ ఆరోగ్య సంరక్షణ అందించాయన్నారు. ఐదు దశలుగా ప్రారంభమయ్యే పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సురేష్ కోరారు.

మహాకవి గుర్రం జాషువా

ఒంగోలు టౌన్: తెలుగు నేల మీద పుట్టి రచనలు చేసిన మహాకవి గుర్రం జాషువా యావత్ దేశానికే గర్వకారణమని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. మాదిగ జన సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం ఎన్టీఆర్ కళాక్షేత్రంలో జరిగిన మహాకవి గుర్రం జాషువా 128వ జయంతిలో ప్రసంగించారు. జాషువా సాహిత్యం కేవలం ఒక కాలానికే పరిమితం కావని, భూత భవిష్యత్ వర్తమాన కాలాలను రగిలించే శక్తి ఆయన సాహిత్యానికి సొంతమన్నారు. గుర్రం జాషువా సాహిత్యాన్ని అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందని మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ చెప్పారు. ఎంజేఎస్ఎస్ అధ్యక్షుడు గంగవరపు విజయ్‌కుమార్, మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత పుసునూరి రవీందర్, ప్రముఖ కవి డాక్టర్ కోయి కోటేశ్వరరావు ప్రసంగించారు. నాటకరంగ ప్రముఖులు సూరిబాబు, ఏసుదాసు, పలుకూరు కృపారావు, కత్తి కళ్యాణ్, ఎం.శాంతారావు, గడ్డం మనోరమ, జిరా ఆనందరావులను గుర్రం జాషువా అవార్డులతో సత్కరించారు. ఈ సందర్భంగా తమ్ములూరి కిశోర్ బాబు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.



చిత్ర పటానికి నివాళి అర్పిస్తున్న మంత్రి సురేష్

బాబు మాయ మాటలు నమ్మవద్దు

ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేసి అధికారమే ప్రధాన ధ్యేయంగా చంద్రబాబునాయుడు మాయ మాటలు చెప్తాడని, ఆయన మాటలు నమ్మవలసిన అవసరం లేదని మంత్రి కోరారు. ఎన్నికల ముందు మొసలి కన్నీరు కార్చుతూ.. అలివికాని వాగ్దానాలు చేస్తారన్నారు. అరచేతిలో వైకుంఠాన్ని చూపే బాబు అధికారంలోకి వచ్చిన తరువాత ఆ వాగ్దానాలు విస్మరించి, రెండు అర చేతుల్లో నరకాన్ని గుమ్మరిస్తారని విమర్శించారు. 2014లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు «దోచుకో, దాచుకో, పంచుకో» అనే పథకాలను అమలు పరచి వాటిని సక్రమంగా అమలు చేసే బాధ్యతను తమ పార్టీ నాయకులకు అప్పజెప్పారని వ్యంగ్యంగా అన్నారు. ప్రజా ధనాన్ని లూటీ చేసిన ఆయన ప్రస్తుతం రాజమండ్రి సెంట్రల్ జైల్లో ఊచలు లెక్కపెడుతున్నారని చెప్పారు. అమరావతి భూకుంభకోణంలో ఆయన తనయుడు లోకేష్ త్వరలో అరెస్ట్ కావటానికి సిద్ధంగా ఉన్నారన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఒంగోలు మూర్తిరెడ్డి, యర్రగొండపాలెం, పుల్లలచెరువు, పెద్దారవీడు, పెద్దదోర్నాల మండల కన్వీనర్లు కె.ఓబులరెడ్డి, బి.వి.సుబ్బారెడ్డి, పి.కృష్ణారెడ్డి, గంటా రమణారెడ్డి, జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ షాబీర్‌బాష, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ఎం.ఆదిశేషు, సచివాలయాల మండల కన్వీనర్లు సయ్యద్ జబీవుల్లా, గుండవరపు రమణారెడ్డి, గొౖడాలి కొండ దేవస్థానం కమిటీ చైర్మన్ దుద్యాల వెంకటరెడ్డి, నాయకులు ఎస్.వెంకటరెడ్డి, వై.వెంకటేశ్వరరెడ్డి, బి.బాలచెన్నయ్య పాల్గొన్నారు.

డాక్టర్ల విభాగం రాష్ట్ర అధ్యక్షునిగా బత్తుల

ఒంగోలు సెంట్రల్: వైఎస్సార్ సీపీ డాక్టర్ల విభాగం రాష్ట్ర అధ్యక్షునిగా జిల్లాకు చెందిన డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డిని నియమించారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు 76 మందితో వైఎస్సార్ సీపీ డాక్టర్ల విభాగం రాష్ట్ర కమిటీని నియమిస్తున్నట్లు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. అశోక్‌కుమార్‌రెడ్డితో పాటు జిల్లాకు చెందిన పలువురికి రాష్ట్ర కమిటీలో స్థానం దక్కింది. వారిలో జోనల్ ఇన్‌చార్జ్ (జోన్–5)గా డాక్టర్ జీవన్ చిట్టితోటి, అధికార ప్రతినిధిగా డాక్టర్ మాదాసి వెంకయ్య, డాక్టర్ ఎస్.ఎం.బాషా, ప్రధాన కార్యదర్శులుగా డాక్టర్ యాదాల అశోక్, డాక్టర్ చెప్పల్లి కనకదుర్గ, డాక్టర్ గోల్లమూడి మధుకిరణ్‌రెడ్డి, డాక్టర్ కర్ణా వెంకటేశ్వరరెడ్డి, డాక్టర్ పెరుగు మురళీకృష్ణ, సంయుక్త కార్యదర్శిగా డాక్టర్ జోసఫ్ లూథర్ అరుణ్‌కుమార్ నియమితులయ్యారు.

జిల్లా అధ్యక్షునిగా చంద్రగిరి నందకిషోర్...

వైఎస్సార్ సీపీ వైద్య విభాగం జిల్లా, ఒంగోలు నగర కమిటీలను కూడా పార్టీ కేంద్ర కార్యాలయం నియమించింది. జిల్లా అధ్యక్షునిగా చంద్రగిరి నందకిషోర్ (ఒంగోలు), ఉపాధ్యక్షులుగా ఎంవీ కృష్ణారెడ్డి (దర్శి), చెప్పల్లి కనకదుర్గ (మార్కాపురం), ప్రధాన కార్యదర్శులుగా పి.మురళీకృష్ణ (కనిగిరి), బి.రామలింగేశ్వరరావు (ఒంగోలు), పల్లపాటి వెంకటేశ్వర్లు (యర్రగొండపాలెం), పలటాల వెంకటసుబ్బారావు (సంతనూతలపాడు) నియమితులయ్యారు. కార్యదర్శులుగా మణిబాబు జాలాది (ఒంగోలు), జి.అవినాష్ (ఒంగోలు), ఎన్‌వీబీఎల్ కిరణ్‌కుమార్ (మార్కాపురం), ఏలూరి లక్ష్మీనారాయణ, ఆచారి (సంతనూతలపాడు), పమిడి శ్రీను (సంతనూతలపాడు), షేక్ ముబీనా (మార్కాపురం), కృపాసావినీల్ (దర్శి), డి.సింగయ్య (కొండపి), శ్రీనివాసరెడ్డి (కొండపి), వి.మణికంఠ (కొండపి), జె.తిరుపతిరావు (యర్రగొండపాలెం), మీరావలి (యర్రగొండపాలెం), సంయుక్త కార్యదర్శులుగా షేక్ మస్తాన్‌వలి (దర్శి), కె.శ్రీలత (మార్కాపురం), నక్కా వెంకటేశ్వర్లు (యర్రగొండపాలెం), ఈ నడిపి మంత్రుబాబు (యర్రగొండపాలెం), సూరిపర్తి అంకరాజు (సంతనూతలపాడు), కొత్తపల్లి శ్రీనివాసరావు (సంతనూతలపాడు) నియమితులయ్యారు.

ఒంగోలు నగర కమిటీ అధ్యక్షునిగా మణిబాబు...

ఒంగోలు నగర కమిటీ అధ్యక్షునిగా జె.మణిబాబు, ఉపాధ్యక్షులుగా ఎల్.సునీల్‌కుమార్‌రెడ్డి, వంశీకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా ఎం.ఆనంద్, ఎం.మాలకొండారెడ్డి, జి.రామ్మోహన్‌రావు, సురేంద్రనాథ్, సుశ్మింతసింగ్, డి.రమణారెడ్డి, కార్యదర్శులుగా కె.నాగమాధురి, మారెడ్డి రామచంద్రారెడ్డి, వై.స్రవంతి, సీహెచ్ వరుణ్, సరయు, తిరుమలరెడ్డి, మారం రమణారెడ్డి, నిరంజన్, సంయుక్త కార్యదర్శులుగా ఐవీ రెడ్డి, అమృత్, వి.రామకృష్ణారెడ్డి, వి.విజయ్, ఎస్.హర్షవర్ధన్‌రెడ్డి, ప్రేమ్‌రాజ్, ఆర్ఎస్ దీక్షిత, కళ్యాణ్, సందీప్ నియమితులయ్యారు.

అందరికీ వైద్య సేవలు



మాట్లాడుతున్న జంకె వెంకటరెడ్డి

మార్కాపురం: రాష్ట్రంలో పేద, ధనిక అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చర్యలు తీసకుంటున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి అన్నారు. శనివారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి సచివాలయ పరిధిలో 45 రోజులపాటు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ప్రతి ఒక్కరూ వచ్చే ఎన్నికల్లో మద్దతు తెలిపి ఓట్లు వేసి మరొకసారి సీఎంగా గెలిపించాలని జంకె విజ్ఞప్తి చేశారు. సమావేశంలో రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోతుల కొండయ్య, పార్టీ నాయకులు పంబి వెంకటరెడ్డి, గౌస్ మొహిద్దీన్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు అండగా ఉండాలి

- ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించటం శుభ పరిణామం
- పీపీఈ కిట్లు అందజేత
- కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్



మెడికల్ క్యాంప్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, మేయర్ గంగాడ సుజాత

ఒంగోలు సబర్బన్: పారిశుద్ధ్య కార్మికులు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక ఒంగోలు నగర పాలక సంస్థ–ఉపాస్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సంయుక్తంగా శనివారం మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరంలో మాట్లాడారు. కార్మికుల విషయంలో ఒంగోలు నగర పాలక సంస్థ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవటం హర్షణీయమన్నారు. వీరితో పాటు ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండేలా ప్రజా వైద్యరంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం బలోపేతం చేస్తోందన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలను సైతం అమలు చేస్తూ క్షేత్ర స్థాయిలోనే వైద్య సేవలు అందించటం మంచి పరిణామమన్నారు. ఊపిరితిత్తులు, గుండె, క్యాన్సర్, గైనకాలజీ, చర్మ వ్యాధులు, బీపీ, షుగర్ తదితర వ్యాధులకు స్పెషలిస్ట్ డాక్టర్లతో ప్రత్యేకంగా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం శుభపరిణామమన్నారు. మందులు కూడా ఉచితంగా ఇచ్చేలా నగర పాలక సంస్థ అధికారులు చర్యలు తీసుకోవటం అభినందనీయమని కొనియాడారు. ప్రభుత్వ వైద్యులతో పాటు ఉపాస్, ఆస్టర్ రమేష్ వైద్యులు కూడా భాగస్వాములు కావటం సంతోషకరమన్నారు. నగర మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ అందరి ఆరోగ్యం కోసం పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్య రక్షణ బాధ్యతను ఒంగోలు నగర పాలక సంస్థ తీసుకుందన్నారు. ప్రైవేటు వైద్యశాలల వైద్యులు కూడా ఈ ప్రక్రియలో తమతో కలిసి రావటం సంతోషకరమన్నారు. డివిజన్ల వారీగా పారిశుద్ధ్య కార్మికులంతా వైద్య పరీక్షలు చేయించుకునేవిధంగా నిర్దిష్ట ఏర్పాట్లతో ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. ఒంగోలు నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా సెప్టెంబర్ 15 నుంచి నెలాఖరు వరకు ఒంగోలు నగరంలో ముమ్మరంగా కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఉచితంగా వైద్య పరీక్షలు, మందులతో పాటు పీపీఈ కిట్లు కూడా అందజేశామని వెల్లడించారు. డిప్యూటీ మేయర్లు వేమూరి సూర్యనారాయణ, వెలనాటి మాధవ రావు, ఉపాస్ వైద్యులు ఉమాపతి, ప్రకాష్, అనీల్ కుమార్, ఎం.వెంకటేశ్వర్లు, ఆస్టర్ రమేష్ ఆస్పత్రి వైద్యులు సి.హెచ్ శ్యాం సుందర్, కె.ప్రతిమ, కార్పొరేటర్లు ఇమ్రాన్ ఖాన్, గోపిరెడ్డి, అంబటి ప్రసాదు, ఆదిపూడి గిరిజా శంకర్ శాండిల్య పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యమే జగన్ లక్ష్యం



రోగులను పరామర్శిస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే సుధాకర్‌బాబు

చీమకుర్తి: రాష్ట్రంలోని ప్రజలందరినీ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా చేయటమే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు అన్నారు. శనివారం సంతనూతలపాడు మండలం ఎండ్లూరులో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని వారి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా బూచేపల్లి వెంకాయమ్మ, టీజేఆర్ సుధాకర్ బాబు మాట్లాడుతూ ఈ అవకాశాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం రోగులకు స్థానిక మండల స్థాయి వైద్యులు ఆధ్వర్యంలో రోగులకు ఉచిత వైద్యంతో పాటు మందులను పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, జెడ్పీటీసీ దుంపా రమణమ్మ, పాల్గొన్నారు.

పథకాలు సద్వినియోగం చేసుకోండి



కిట్లు అందిస్తున్న జేడీ డాక్టర్ బేబీ రాణి, ఆళ్ల రవీంద్రనాథ్ రెడ్డి, బొట్ల రామారావు

ఒంగోలు సబర్బన్: ప్రభుత్వ పథకాలను గ్రామీణ యువత, ఔత్సాహిక రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారిణి డాక్టర్ కొప్పరపు బేబీ రాణి పిలుపునిచ్చారు. శనివారం స్థానిక రంగా భవన్‌లో జాతీయ లైవ్ స్టాక్ మిషన్ పథకానికి సంబంధించి ఏర్పాటు చేసిన అవగాహనా కార్యక్రమంలో మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లోని వారికి ఉపాధి అవకాశాలు కల్పించి తద్వారా ఆర్థికంగా పురోభివృద్ధి సాధించేందుకు జాతీయ లైవ్ స్టాక్ మిషన్ ఎంతగానో దోహదపడుతుందన్నారు. 2021–22 నుంచి 2025–26 వరకు ప్రణాళికలు రూపొందించి, ఈ పథకంలో మేకలు, గొర్రెలు పెంపకంతో పాటు కోళ్ళ పెంపకం, పందుల పెంపకం, పశుగ్రాసం, దాణా తయారీలో శాస్త్రీయ యాజమాన్య పద్ధతులను పాటిస్తామన్నారు. జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ ఆళ్ళ రవీంద్రా రెడ్డి మాట్లాడుతూ జాతీయ లైవ్‌స్టాక్ మిషన్ ద్వారా పాలు, గుడ్లు, మాంసం, ఉత్పత్తిని పెంచి వాటికి సరైన మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించటమే ధ్యేయంగా ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నాయన్నారు. ఒక్కో యూనిట్ నెలకొల్పటానికి రూ.1 కోటి మొదలుకొని అంతకుమించి ప్రాజెక్టు విలువ ఉంటే గరిష్టంగా రూ.50 లక్షలు రాయితీ అందిస్తున్నట్లు వెల్లడించారు. జిల్లా గొర్రెల, మేకల పెంపకందారుల సహకార సమాఖ్య చైర్మన్ బొట్ల రామారావు మాట్లాడుతూ ఆన్‌లైన్ ద్వారానే దరఖాస్తులు చేసుకోవటానికి వీలుందని, కానీ ఒంగోలులోని తమ సమాఖ్య కార్యాలయంలో సాయం అందిస్తుందని కూడా హామీ ఇచ్చారు. డీఎల్‌డీఏ చైర్మన్ కోసూరి రాధ, ఎల్‌డీఎం అబ్దుల్ రహీం పాల్గొన్నారు.

ఇంజినీరింగ్‌తో విస్తృత ఉద్యోగ అవకాశాలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి, పక్కన వీసీలు ప్రసాదరాజు, అంజిరెడ్డి

మార్కాపురం: ఇంజినీరింగ్ విద్యార్థులకు విస్తృత ఉద్యోగ అవకాశాలున్నాయని, అందులో డిప్లమో పాసైన వారికి మెరుగైన ఉద్యోగాలు సిద్ధంగా ఉన్నాయని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి అన్నారు. శనివారం రాత్రి స్థానిక ఎ1 గ్లోబల్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ విద్యార్థుల ఫ్రెషర్స్‌డే వేడుకలకు జేఎన్‌టీయూ కాకినాడ వైస్ ఛాన్సలర్ ప్రసాదరాజు, ఆంధ్రకేసరి యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ అంజిరెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఎమ్మెల్యే కేపీ మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంటు కచ్చితంగా ఉండాలన్నారు. మెకానికల్, సివిల్, కంప్యూటర్ సైన్సు, ఎలక్ట్రికల్ తదితర విభాగాల్లో ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ఉద్యోగ అవకాశాలు అందరికీ సమానంగా ఉన్నాయనీ, సాంకేతికంగా వస్తున్న మార్పులను అందిపుచ్చుకోవాలని సూచించారు. సాంకేతిక నైపుణ్యాలను అందించడంలో కళాశాల చైర్మన్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ మీర్జా షంషేర్ అలీబేగ్ ముందుంటారన్నారు. ఆంధ్రకేసరి యూనివర్సిటీ అంజిరెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్ సమీపంలోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో చదివిన ఓ విద్యార్థి అమెరికాలోని సౌత్ ఫ్లోరిడా యూనివర్సిటీలో ఎంఎస్ చేసి నూతన సాంకేతిక సాఫ్ట్‌వేర్‌ను రూపొందించారని తెలిపారు. ఆ సాఫ్ట్‌వేర్‌ను ప్రస్తుతం అమెరికాలో వాడుతున్నారన్నారు. వీసీ ప్రసాదరాజు పలు సూచనలు ఇచ్చారు. డాక్టర్ మీర్జా షంషేర్ ఆలీబేగ్ మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ సంస్థల్లో ఉద్యోగాలు చేయడం సంతోషంగా ఉందన్నారు. డాక్టర్ మగ్బుల్ బాషా, కళాశాల ఫౌండర్ ఉస్మాన్‌బేగ్, జాఫర్ బేగ్, ప్రిన్సిపాల్స్ డాక్టర్ శ్రీధర్, షేక్ మహమ్మద్ రఫీ, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి పీఎల్‌పీ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.